# నవ్వు

**వైజాగ్ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పని ముగించుకని తిరుగుబస్సు కోసం ఎదురుచూస్తున్నాడు నందనరావు.**

**శ్రీహరిపురం, గాజువాక వెళ్తుంది అంటూ ఒక ట్రెక్కర్ వచ్చి ఆగింది. బస్సు కోసం చూడడమెందుకని ట్రెక్కర్ ఎక్కాడు నందనరావు. నలుగురు కూర్చోవలసిన సీటులో అయిదుగురు కూర్చున్నారు. నందనరావు పక్కన ఒక అమ్మాయి కూర్చుంది.**

చిన్నగా చీకటి పడుతోంది.

ఇలాంటి ఛాన్స్ వచ్చినందుకు నందనరావు మనసులో సంతోషిస్తున్నాడు.

డ్రైవర్ సడెన్‌బ్రేక్‌లేస్తూ పోనిస్తున్నాడు. నందనరావు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నాడు.

''ఎక్కడవరకూ వెళ్తారు?'' ప్రక్కనున్న అమ్మాయిని అడిగాడు నందనరావు.

''శ్రీహరిపురం'' చెప్పిందా అమ్మాయి.

ఆ అమ్మాయి దిగిన స్టేజీ తరువాత దిగాలి అనుకున్నాడు నందనరావు.

డ్రైవర్ ఇంకా టికెట్ల కోసం చూస్తూ ఆలస్యం చేస్తున్నాడు.



అదే కావాలనుకుంటున్నాడు నందనరావు.

నందనరావు ఇంకా ఇంకా జరుగుతున్నప్పటికీ ఆ అమ్మాయి సర్దుకుపోతోంది.

పక్కవాడితో జోక్‌లేస్తూ మాట్లాడుతున్నాడు నందనరావు.

ఆ అమ్మాయి ముసిముసిగా నవ్వుకుంది.

శ్రీహరిపురం రానే వచ్చింది. ఇదే ఆఖరిసారని చిన్నగా గిచ్చాడు నందనరావు. ఇదేమీ పట్టనట్టు ఆ అమ్మాయి అక్కడ దిగిపోయింది.

''డ్రయివర్ తొందరగా పోనివ్వండి'' అన్నాడు నందనరావు.

''అలాగే'' అంటూ స్పీడందుకున్నాడు డ్రైవర్.

గాజువాక వచ్చింది.

డబ్బులు కోసమని జేబులో చెయ్యి పెట్టిన నందనరావుకి గుండె ఝుల్లుమంది.

''డబ్బులివ్వండీ'' గట్టిగా అన్నాడు డ్రైవర్.

''పర్స్ ఎవరో కొట్టేసారండీ'' దీనంగా అన్నాడు నందనరావు.

''డబ్బులివ్వకపోతే ఎలాగండీ?'' అన్నాడు డ్రైవర్.

పై జేబులో ఉన్న చిల్లర అయిదు రూపాయలు డ్రైవర్‌కి ఇచ్చాడు నందనరావు.

''భలే బేరం'' అనుకుంటూ ట్రెక్కర్‌ని పోనిచ్చాడు డ్రైవర్.

భారంగా అడుగులేస్తున్న నందనరావుకి ఆ అమ్మాయి ముసిముసిగా నవ్వుతున్నట్టు అనిపించింది.

**-వైదా ఈశ్వరరావు (మింది)**

# కలలు

**"స్వామి!"**

**"....."**

**"స్వామి మౌనంగా ఉన్నారు. అలా ఉన్నారంటే స్వామి మనసులో ఏదో మహత్తరకార్యం రూపుదిద్దుకున్నట్లే" కుతూహలంగా అని స్వామి వైపు చూశాడు ఓ భక్తుడు.**

"మీరలా వెళ్ళి మండపంలో విశ్రాంతి తీస్కోండి. స్వామి ఏదో దీక్షలో ఉన్నారు" స్వామి శిష్యుడొకాయన చెప్పాడు.

ఎవరో ఒకాయన హడావిడిగా వచ్చి "స్వామిగారు నిర్వహించే యాగానికి డబ్బు ఎక్కడ కట్టాలండి!" అని అడుగుతున్నాడు.

"బయట కౌంటర్‌లో" ఎవరో చెప్పారు.

మండపమంతా జనంతో కిటకిటలాడుతోంది. లోపల స్వామి ధ్యానంలో ఉన్నారు. సాయంత్రం ప్రసంగానికి భక్తులు ఉత్సాహంగా చేరిపోతున్నారు. ఉచిత సేవ చేసే వాళ్ళు ముందుగా తమ పేర్లని నమోదు చేసుకుంటున్నారు.

సాయంత్రం ఉపన్యాసం అందర్నీ రక్తి కట్టించింది. త్వరలో జరుపబోయే యాగానికి భక్తులు విరివిగా డబ్బు చెల్లించారు. స్వామి చెప్పిన విషయాలు ఛానల్స్‌లో ప్రచారం అయ్యాయి.

స్వామి చేయబోయే యాగం పేరు 'ధనయాగం'. అది చేస్తే, దానిలో భాగమైన వాళ్ళందరి ఇంట లక్ష్మి ప్రవేశించి శ్రీమంతులవుతారు. అందుకే! కలెక్షన్స్‌లో ధన యాగం కోసం కోట్లు కోట్లు వచ్చి చేరాయి. చేరిపోతున్నాయి.

లోకేశ్వరస్వామి పేరుతో ఉన్న సత్తిబాబుకి ఆ జనాన్ని, ఆ జనం ఇచ్చేస్తున్న డబ్బుని చూసి కళ్ళు చెదిరిపోయాయి.

"కోట్లు..కోట్లు..ఇదంతా ఏం చేయాలి. కోట్లు..."

చెళ్‌మని పేలిపోయింది దవడ.

ఉలిక్కిపడి లేచాడు సత్తిబాబు.

ఎదురుగా తండ్రి. చేతిలో 'రుద్రయాగ స్వామి' గూర్చి వేసిన పేపరు. మత్తు దిగిపోయింది. తండ్రి వంక భయంగా చూశాడు.

"ఎమ్.ఏ. చదివి ఇంత చిన్న ఉద్యోగం కూడా సంపాదించలేకపోయావ్! కోట్లట కోట్లు..కలలు కంటున్నాడు కోట్లు కోసం. బడుద్దాయ్ వెధవ. సోమరిలా పడుండకపోతే ఏదోక చిన్న పని చేయలేవ్! కలలు కనేవాడు ఆకాశానికి నిచ్చెనలు వేయడమే కానీ అవి జరగవ్. కష్టపడి పన్జేసే వాడు ఏదైనా సాధించగలడు" అనేసి తండ్రి బయటకెళ్ళిపోయాడు.

సత్తిబాబు పేపర్ని గోడకేసి కొట్టి, "ఈ పేపర్‌ని చదవగానే కల్లోకి కూడా దూరిపోయాడు ఈ స్వామి!" అనుకుంటూ ఉద్యోగ ప్రయత్నానికి బయలుదేరాడు.

**-ఉండవిల్లి.ఎమ్ (పెంటకుర్రు)**